రహదారుణం


అధ్వానంగా బీచ్ రోడ్డు-ఎండాడకు వెళ్లే రహదారి

- వర్షం పడితే ప్రయాణం నరకం
- రాళ్లు తేలిన ప్రధాన రహదారులు
- హామీలు నిలబెట్టుకోని కూటమి నేతలు


సాగర్‌నగర్ నుంచి ఎండాడకు వెళ్లే సర్వీస్ రోడ్డు దుస్థితి


ఎండాడ నుంచి మధురవాడకు వెళ్లే రహదారి

కొమ్మాది: అడుక్కో గొయ్యి, గజానికో గుంత. రాళ్లు తేలిన కంకర రోడ్డు. ఏక్కడ పడితే అక్కడ చెరువును తలపించే ప్రధాన రహదారులు...చినుకు పడితే ప్రయాణం ప్రమాదకరంగా సాగుతోంది. ఇదెక్కడో మారుమూలు ప్రాంతం అనుకుంటే తప్పులో కాలేసినట్టే. దినదినాభివృద్ధి చెందుతున్న ఎండాడ..సాగర్‌నగర్ ప్రాంతాల దుస్థితి ఇది. అధికారంలోకి రాక ముందు కూటమి నేతలు రహదారులు అధ్వానంగా ఉన్నాయని విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో గెలిచిన తరువాత రోడ్ల అభివృద్ధిని పూర్తిగా మర్చిపోయారు. జీవీఎంసీ 8వ వార్డులో సాగర్‌నగర్, రుషికొండ, ఎండాడ, గుడ్లవానిపాలెం, రాజీవ్ నగర్, దుర్గానగర్ ప్రాంతాల్లో అనేక చోట్ల రహదారులు అభివృద్ధికి నోచుకోక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బీచ్‌రోడ్డు నుంచి గొల్లల ఎండాడ, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే సుమారు 2 కి.మీ. పైగా పొడవు గల రహదారి గుంతలమయంగా మారింది. ఈ మార్గంలో వేలాది నివాసాలు ఉన్నాయి. రోజుకు పెద్ద సంఖ్యలో వాహనదారులు ప్రయాణిస్తుంటారు. ఎండాడ -రుషికొండ నుంచి శ్రీరామ్ ప్రాపెర్టీస్‌కు వెళ్లే ప్రాంతాలను కలిపే మార్గం. సిరిగుడి నగర్ నుండి ఎండాడ పెట్రోల్ బంక్‌కు వెళ్ళే అనుసంధాన రహదారి పరిస్థితి అంతే..సాగర్ నగర్ నుంచి బీచ్ రోడ్డుకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. దీంతో ఇటువైపు ప్రయాణించేవారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితులున్నాయి. అదే విధంగా సాగర్‌నగర్, ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం సమీప బీచ్ రోడ్డు కూడలి నుంచి సన్ ఇన్‌స్టిట్యూట్, దసపల్లా లేఅవుట్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన అనుసంధాన రహదారి అభివృద్ధికి నోచుకోలేదు.

ప్రయాణం నరకప్రాయం



ఎండాడ నుంచి మధురవాడ వెళ్లే రహదారి పూర్తిస్థాయిలో గుంతలమయంగా మారింది. రాత్రి సమయాల్లో ఇటుగా ప్రయాణించాలంటే ఓ సాహసమే. వర్షాలు పడినప్పుడు, రాత్రి సమయాల్లో ఇటుగా ప్రయాణించే వారు ప్రమాదాలకు గురవుతున్నారు.
– ఎ. పార్వతి, ఎండాడ

ప్రమాదాలను నివారించాలి



8వ వార్డులో అనేక చోట్ల రోడ్లు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. వీటి వలన తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల నివారణలో బాగంగా అధికారులు స్పందించి రోడ్డును మరమత్తులు చేయాలి. గోతులు రోడ్డుతో ప్రయాణించాలంటే కష్టంగా ఉంది.
– రాంబాబు, సాగర్‌నగర్

దాసాంజనేయస్వామి ఆలయంలో 7,13వ తేదీల్లో ప్రత్యేక పూజలు

తగరపువలస: భీమిలిలోని శ్రీసీతారామ లక్ష్మణ సహిత దాసాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 7, 13వ తేదీలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ప్రధాన అర్చకుడు ఆసూరి మరింగంటి వంశీ మోహన చెన్న కృష్ణమాచార్యులు తెలిపారు. సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా 7వ తేదీ ఉదయం 6.30 గంటలకు అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. 13న ఉదయం 6.30 గంటల నుంచి దాసాంజనేయస్వామికి అర్చనలు, అభిషేకాలు 10 గంటల నుంచి సువర్చల దాసాంజనేయస్వామికి సామూహిక హనుమత్ వ్రతాలు, సాయంత్రం 5.30 నుంచి దీపారాధన, శ్రీరామ సంకీర్తన, హనుమాన్ చాలీసా, సుందరకాండ పారాయణ చేయనున్నారు.

బాబూ రాజేంద్రప్రసాద్‌కు నివాళులు


తాటితూరు ప్రాథమిక పాఠశాలలో రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తగరపువలస: మొదటి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ 140వ జయంతిని మంగళవారం భీమిలి ఆదర్శహిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు ఆధ్వర్యంలో రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన జీవిత చరిత్ర గురించి వివరించారు. బహుభాషా కోవిదుడైన ఆయన ధనిక కుటుంబానికి చెందిన వాడైనా నిరాడంబర జీవితాన్ని గడిపారన్నారు. భీమిలి మండలం తాటితూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కూడా బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి వేడుకలు నిర్వహించారు.

310 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు


చిప్పాడలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సిబ్బంది

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ ఆధ్వర్యంలో మంగళవారం సుత్తమ్మ ఆలయం వద్ద నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 310 మందికి పరీక్షలు నిర్వహించారు. అన్నవరం, చిప్పాడ, పెగనాగమయ్యపాలెం, గుడివాడ, మూలకుద్దు, టి.నగరపాలెం, తూడెం పంచాయితీలకు చెందిన వారికి నగరంలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సిబ్బంది తనిఖీ నిర్వహించారు. ఇందులో 170 మందికి కళ్లద్దాలు, 75 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. విడతలవారీగా ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు, 20 రోజుల్లో కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్టు దివీస్ జనరల్ మేనేజర్ ఎం.ఎస్.ఎన్.రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు శ్రీనివాస్, నరసంహ, శేఖర్‌బాబు, ఆస్పత్రి కో ఆర్డినేటర్లు స్వాములు, ఆప్తమాలజిస్టులు నాగలక్ష్మి, శారదా బాలం, శిరీష, అనూష, సంతోషి, దుర్గారావు, గ్రామపెద్దలు ఆశి రమణ, సూరిబాబు, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

52 ఎకరాల్లో నేలకొరిగిన వరి


తుపానుకు రౌతులపాలెంలో నేలవాలిన వరి పైరు

తగరపువలస: ఇటీవల తుపాను కారణంగా ఆనందపురం మండలంలో సుమారు 52 ఎకరాల్లో వరి పంట నేలకొరిగినట్టు ఏవో చావా సంధ్యా రత్నప్రభ తెలిపారు. మంగళవారం ఆమె మండలంలోని బోని, గొట్టిపల్లి పంచాయతీలలో నేలవాలిన వరిపొలాలను సందర్శించారు. ఇప్పటికే పంట కోసి పొలాల్లో పనలు ఆరబెట్టి ఉంచితే వరికంకులు మొలకెత్తే ప్రమాదం ఉందన్నారు. ధాన్యం మొలకెత్తకుండా లీటరు నీటిలో 20 గ్రాముల ఉప్పు కలిపిన ద్రావణాన్ని పనలపై పిచికారి చేయాలన్నారు. చేను పడిపోయిన పొలాల్లో పాయలు తీసి పక్క పక్క దుబ్బులను కలిపి కట్టలుగా నిలబెట్టాలని రైతులకు సూచించారు.

తెరిపివ్వని వర్షంతో రోడ్లు ఛిద్రం


బురదగా మారిన బక్కన్నపాలెం రహదారి

మధురవాడ: తుఫానుతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో శివారు ప్రాంతాలలో రోడ్లు బురదమయమయ్యాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బక్కన్నపాలెం నుంచి ఇరువైపులా రహదారులు బురదతో దర్శనమిస్తున్నాయి.

ఫుట్‌పాత్‌పై వాడి పడేసిన సిరంజిలు


తాళ్లవలస సచివాలయం సమీపంలో ఫుట్‌పాత్‌పై సిరింజిలు, ఇంజక్షన్ సీసాలు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీలో జాతీయరహదారిని ఆనుకుని సర్వీస్‌రోడ్డులోని ఫుట్‌పాత్‌పై వాడి పడేసిన సిరంజిలు, ఇంజక్షన్లు దర్శనమిచ్చాయి. ఒకసారి వినియోగించిన సిరంజిలను నాశనం చేయాల్సి ఉండగా ఇలా బహిరంగంగా పడేయడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్పత్రి వ్యర్థాలు బహిరంగ ప్రదేశంలో పడేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దోమల నివారణకు వీధుల్లో ఫాగింగ్


సంతపేటలో ఫాగింగ్ చేస్తున్న శానిటేషన్ ఉద్యోగి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో దోమల నివారణకు గాను మంగళవారం సాయంత్రం శానిటేషన్ సిబ్బంది వీధుల్లో ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది దోమల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్త గురించి ఇంటింటా అవగాహన కల్పించారు. రెండోవార్డు సంతపేట గొల్లవీధి, కుమ్మరివీధి, గణేష్ థియేటర్ సెంటర్, రెడ్డివీధి, సంతబయలు ప్రదేశాలలో ఈ ఫాగింగ్ చేశారు.

అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష

తగరపువలస: ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జెడ్పీ డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్ అధికారులతో సమావేశమై అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఇవిధ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జానకి, మజ్జి వెంకటరావు, మండల అధికారులు పాల్గొన్నారు.

వర్షాలపై అప్రమత్తం


ఎమినిటీస్ సెక్రటరీలు, అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న ఈఈ శాంతిరాజు

మధురవాడ: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ జోన్–2 ఈఈ శాంతిరాజు పేర్కొన్నారు. కొండవాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జోనల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఎమినిటీ సెక్రటరీలను ఉద్దేశించి మాట్లాడారు. కొండవాలు ప్రాంతాల్లో ఎటువంటి ఇబ్బందులు తెలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

క్లుప్తంగా

రాస పోలమాంబకు ప్రత్యేక అలంకరణ


ప్రత్యేకంగా అలంకరణలో రాస పోలమాంబ

తగరపువలస : భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం ఆలయ కమిటీ ప్రతినిధులు తులసి మాలలు, జాజులు, జర్బరా, కనకాంబరాలతో అలంకరించారు. ఈ అలంకరణకు గాను శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన కర్రి కనకారావు, మౌనిక, హన్విత దేవి సహాయ సహకారాలు అందించారు. తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు. చుట్టుపక్కల గ్రామల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

రుషికొండలో పాము కలకలం


పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ శ్రీనివాస్

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ పరిధిలోని స్వర్ణభారతీనగర్‌లో మంగళవారం భారీ నాగుపాము కలకలం రేపింది. ఇక్కడ నివాసం ఉంటున్న ఓ వ్యక్తి పెరట్లో ఎనిమిదిన్నర అడుగుల నాగుపాము కనిపించడంతో భయాందోళనకు గురయ్యాడు. వెంటనే స్నేక్ క్యాచర్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడకు చేరుకున్న శ్రీనివాస్ పామును చాకచక్యంగా పట్టుకున్నాడు. ఇదంతా కొండ ప్రాంతం కావడంతోనూ, వర్షాలు పడుతున్న నేపథ్యంలో విష సర్పాలు వస్తున్నాయని శ్రీనివాస్ తెలిపారు.

గురుస్వామి సన్యాసిరాజు హఠాన్మరణం


సన్యాసిరాజు (ఫైల్)

భీమునిపట్నం: గురుస్వామి, గాయకుడు అడిదం సన్యాసిరాజు (58) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. అయ్యప్ప దీక్షలో ఉన్న ఆయన స్వామివారి దర్శనం కోసం వెళ్లి కొండ ఎక్కుతుండగా గుండెపోటు రావడంతో అక్కడ మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గురుస్వామిగా ఆయనకు ఎంతో గుర్తింపు ఉంది. అలాగే కళాసాహితి సంస్థకు కార్యదర్శిగా కూడా ఉన్నారు. ఆదివారం జరిగిన రచయితల ఇష్టాగోష్టిలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. సోమవారం శబరిమలైకు వెళ్లి మంగళవారం కొండ ఎక్కుతుండగా మృతి చెందారు. ఆయన మృతితో ఈ ప్రాంతంలో విషాధ ఛాయలు అలుముకున్నాయి.

అనధికార నిర్మాణం తొలగింపు


నిర్మాణాలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు చిన్నరుషికొండలో సర్వే నంబరు 52/20లో 15 సెంట్లు ఆక్రమించి ఓ వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా ఓ భవనాన్ని నిర్మించారు. స్థానికులు ఫిర్యాదు మేరకు మంగళవారం జీవీఎంసీ ప్లానింగ్ సెక్రెటరీ అధికారులు ఆ నిర్మాణాన్ని తొలగించారు. పిల్లర్లను, శ్లాబ్‌ను పూర్తిస్థాయిలో తొలగించారు. నిబంధనలకు విరుద్ధంగా మళ్లీ నిర్మాణాన్ని చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ నాయకుల విగ్రహాల రక్షణకు షెల్టర్ నిర్మాణం


చిట్టివలస జెడ్పీహైస్కూల్ ఆవరణలో షెల్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస జెడ్పీహైస్కూల్ ఆవరణలో జాతీయ నాయకుల విగ్రహాల రక్షణకు గాను 1979 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు రూ.25వేలతో షెల్టర్ నిర్మించారు. ఇటీవల పాఠశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ షెల్టర్ నిర్మించారు. మంగళవారం షెల్టర్‌ను ప్రారంభించారు. తాము చదువుకున్న పాఠశాలకు భవిష్యత్తులో మరిన్ని వసతులు కల్పిస్తామని పూర్వ విద్యార్థులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డీవీ చలపతిరావు, గౌరవ సలహాదారుడు పి.నాగరాజు, కోశాధికారి గోపాలరావు, కార్యనిర్వాక కార్యదర్శులు బండారు ఎల్లాజీరావు, డి.బంగార్రాజు, జి.ఎస్.సుగుణాకరరావు, ఎం.పంచముఖేశ్వరరావు, ఎన్.సూర్యనారాయణ, పి.హేమంత్‌కుమార్, కె.సన్యాసిరావు, ఎం.బంగార్రాజు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం


దివ్యాంగ పిల్లలకు వీల్ చైర్లు అందజేస్తున్న నారాయణమూర్తి

భీమునిపట్నం: భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి ప్రశంసించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. మానసిక సమస్యలున్న పిల్లలకు ప్రత్యేకంగా శిక్షణ అందిస్తున్నారని అందులో భాగంగా వారికి మాట్లాడడం, చదవడం, ఆటలు ఆడించడం మొదలైన చేస్తున్నారన్నారు. కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న టీచర్ కెజియా కుమారి మాట్లాడుతూ ఇక్కడున్న పిల్లలను ఎంతో జాగ్రత్తగా చూసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించిన రెండు వీల్‌చైర్లను నారాయణమూర్తి అందజేశారు. అలాగే పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందించారు. మండల విద్యాశాఖ అధికారులు శివరాణి, జయప్రద, ఎంపీడీవో హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కారుషెడ్ కూడలిలో లారీ- మినీ బస్సు ఢీ


ప్రమాదంలో దెబ్బతిన్న కారు ముందు భాగం

పీఎంపాలెం: కారుషెడ్ కూడలిలో మంగళవారం తెల్లవారుజామున లారీ–మినీ బస్సు ఢీకొన్నాయి. మంగళవారం తెల్లవారు 4 గంటల సమయంలో కొమ్మాది నుంచి విశాఖవైపు ట్యాంకర్ వస్తోంది. కారుషెడ్ కూడలికి వచ్చేసరికి అదే సమయంలో పీఎం పాలెం వైపు నుంచి వస్తున్న మినీ బస్సు జాతీయ రహదారిపైకి ఎక్కడంతో ట్యాంకర్ లారీ ఢీ కొట్టింది. ఘటనలో మినీ బస్సు ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. రెండు వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయట పడ్డారు. ఆ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు కాలేదని లా–అండ్ ఆర్డర్ సీఐ బాలకృష్ణ తెలిపారు.

మాజీ కౌన్సిలర్ సోమరాజు మృతి


తూతిక సోమరాజు (ఫైల్)

తగరపువలస: భీమిలి మున్సిపాల్టీ మాజీ కౌన్సిలర్ తూతిక సోమరాజు (84) మంగళవారం చిట్టివలసలోని తన ఇంట్లో మృతి చెందారు. సీపీఐ తరఫున రెండు సార్లు కౌన్సిలర్‌గా పనిచేశారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు మెకానిక్ యూనిట్‌లో పనిచేసిన సోమరాజు సీపీఐ, ఏఐటీయూసీ నాయకుడిగా కార్మికుల సమస్యలు, పట్టణ ప్రజల సమస్యలపై చురుకుగా పోరాడారు. ఈయన భార్య 2010లో మృతి చెందగా ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈయన భౌతికకాయాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, నాయకులు అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు, కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, చిల్ల రాంపైడి, మావూరి సన్యాసమ్మ, చిల్ల అప్పలసూరి, వీర్రాజు, నూలు ఆదినారాయణ, ఎరుసు అప్పల నరసయ్య, పల్లా లక్ష్మణరావు, వానపల్లి సత్యం తదితరులు సందర్శించి అరుణ పతాకాన్ని ఆయనపై ఉంచారు. బుధవారం ఉదయం సోమరాజు అంత్యక్రియలు చిట్టివలస శ్మశానాటికలో నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

మురుగుతో అవస్థలు


కొమ్మాది వైఎస్సార్ నగర్‌లో మురుగు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ 5వ వార్డు కొమ్మాది వైఎస్సార్ నగర్‌లో వారం రోజులుగా మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు పొంగుతోంది. 9వ బ్లాక్ వద్ద ఈ ప్రదేశంలో పొంగుతున్న మురుగు కారణంగా చుట్టుపక్కల నివాసం ఉంటున్న ఇళ్లలో చిన్నారులు అస్వస్థతకు గురవుతున్నారు. సచివాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో పలువురు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. తరచూ ఇక్కడ మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు రోడ్లపై ప్రవహిస్తున్నా పరిష్కార చర్యలు చేపట్టడం లేదు.

గోస్తనీనదిని దాటాలంటే సాహసమే..


బురదగా తాటితూరు నుంచి సామియ్యవలసకు వెళ్లే గోస్తనీనదిలో తాత్కాలిక రహదారి


ప్రవహిస్తున్న గోస్తనీనది

తగరపువలస: వర్షాలకారణంగా గోస్తనీనదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. భీమిలి మండలం తాటితూరు పంచాయతీ నుంచి వేముల వారి కళ్లాలు, పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీలోని సామియ్యవలస కళ్లాలకు వెళ్లాలంటే ఈ గోస్తనీనదిని దాటాల్సిందే. నదిని దాటడానికి పంచాయతీవాసులు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న వంతెన బురద మయంగా మారింది. ప్రతిరోజూ నదిని వ్యవసాయదారులు, వ్యవసాయ కూలీలు, ఇటుక బట్టీల కూలీలతో పాటు విద్యార్థులు దాటవలసి ఉంటుంది. వర్షాలకు పాడైపోయిన తాత్కాలిక వంతెన ప్రమాదకరంగా ఉంది. దీంతో విద్యార్థులకు ఒంటరిగా పంపించేందుకు తల్లిదండ్రులు సాహసించడం లేదు. వర్షాలు కురిసిన ప్రతీసారి ఇదే విధంగా తల్లిదండ్రులకు కంటిమీద కునుకు ఉండదు. శాశ్వతంగా గోస్తనీనదిపై వంతెన నిర్మించాలని భీమిలి, పద్మనాభం మండల ప్రజలు కోరుతున్నారు.